సాక్షి ఒడిశా

గురువారం । 10 । జూలై । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు: రూ. 2,29,914

బంగారం: 2 గ్రాముల 50 మిల్లీ గ్రాములు

వెండి: 44 గ్రాముల 100 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



గజపతిలో అధికారుల పర్యటన

గజపతి జిల్లాలో ఉన్నతాధికారులు పర్యటించారు. వివిధ పథకాల అమలుపై క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులతో సమీక్షించారు.

- 4లో



తప్పని డోలీమోత

- 4లో

గిరిశిఖర గ్రామాల్లో డోలీమోతలు తప్పడం లేదు. కలహండి జిల్లా కద్రసోరు గ్రామంలో ఓ నిండు గర్భిణిని నాలుగు కిలోమీటర్లు మంచంపై మోసి ఆస్పత్రికి తీసుకొచ్చారు.

న్యూస్‌రీల్

నందాహండిలో నిధుల స్వాహా



విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీ ప్రదీప్ మజ్జి, ఎమ్మెల్యే మనోహర్ రంధారి తదితరులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా నందాహండి సమితిలో రూ.12 కోట్ల కుంభకోణం జరిగిందని ప్రతిపక్ష బీజేడి ఆరోపించింది. మంగళవారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని గ్లేజ్ హోటల్‌లో పార్టీ మాజీ ఎంపీ ప్రదిప్ మజ్జి విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో అతి చిన్న సమితి నందాహండిలో మూడేళ్లలో 127 ప్రాజెక్టులకు నిధులు విడుదలయ్యాయని చెప్పారు. పనులు జరగకుండానే జరిగినట్లు రికార్డుల్లో చూపించి నిధులు కైంకర్యం చేశారని ఆరోపించారు. వాటర్ షెడ్, హార్టికల్చర్, అటవీ, సమితి విభాగంలో సమష్టి కుంభకోణం జరిగిందన్నారు. తక్షణమే విజిలెన్స్ దర్యాప్తు చేపట్టాలని డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేడీ నాయకులు అరుణ్ మిశ్రా, మంజులా మజ్జి, రబీ పట్నాయక్, సరోజ్ పాత్రో, ప్రమోద్ రథ్, నాగేంద్ర పట్నాయక్, ఉత్తం త్రిపాఠి, రాజేష్ త్రిపాఠి, సుమిత్ పూజారి, దయానిధి బిసోయి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల నిరసన



జయపూర్ బీడీవో కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

కొరాపుట్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ కొరాపుట్ జిల్లాలో రెవెన్యూ ఉద్యోగులు బుధవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్రశాఖ పిలుపు మేరకు నిరసనల్లో పాల్గొన్నారు. ఈ నెల 14వ తేదీలోగా తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించక పోతే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. పాత పింఛన్ విధానం పునరుద్ధరించాలని, కొత్త పెన్షన్ విధానం రద్దు చేయాలని, రూ. 20 లక్షల బీమా ఇవ్వాలని, కొత్త ఉద్యోగాలు ఏర్పాటు చేయాలని, ఖాళీలు భర్తీ చేయాలని నినాదాలు చేశారు. జిల్లాలోని 14 సమితులు, నాలుగు మున్సిపాలిటీల్లో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు.

యువకుడు బలవన్మరణం



ధీరజ్ మృతదేహం

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి మునిఖోల్ గ్రామానికి చెందిన ధీరజ్ ఆచార్య (23) మంగళవారం రాత్రి బలవన్మరణానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధీరజ్ ఆచార్య మునిఖోల్ గ్రామంలోనే తల్లితో కలిసి ఉంటూ చిన్న వ్యాపారం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. అయితే ఏం కష్టం వచ్చిందోగాని మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటిపై కప్పుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్ది సేపటి తరువాత తన తల్లి ఇంటికి వచ్చి చూసేసరికి ధీరజ్ శవమై వేలాడుతూ కనిపించడంతో కన్నీరుమున్నీరైంది. ఇరుగు పొరుగు వారు వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆచార్య మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మునిగుడ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు ఐఐసీ సౌదామిని బెహర తెలిపారు.

సారాతో ఇద్దరి అరెస్టు



నిందితులతో ఎక్సైజ్ సిబ్బంది

జయపురం: చట్ట వ్యతిరేకంగా నాటుసారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు జయపురం అబ్కారీ అధికారి సుబ్రత్ కిశోర్ హిరన్ బుధవారం తెలిపారు. అరెస్టయిన వారిలో జయపురం సమితి ఉమ్మిరి గ్రామానికి చెందిన కరణ కొటియ, డొంగాగుడ వాసి భీమా నాయిక్‌గా వెల్లడించారు. మంగళవారం మధ్యాహ్నం పెట్రోలింగ్ జరుపుతున్న సమయంలో నిందితులు కరణ, భీమాలు సారాను తరలిస్తుండగా పట్టుబడినట్టు పేర్కొన్నారు. వారిరువురుపై రెండు కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచామన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం

కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా అఖిల భారత కార్మిక సంఘాల పిలుపు మేరకు పిలుపుమేరకు బుధవారం నిర్వహించిన సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు కదం తొక్కారు. తమ హక్కుల పరిరక్షణ కోసం గళం విప్పారు. కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని నినదించారు. కనీస వేతన చట్టాలు అమలు చేయాలని, ఇతర న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాగా, సార్వత్రిక సమ్మె నేపథ్యంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు మూతపడ్డాయి.

– సాక్షి నెట్‌వర్క్



రాయగడ: కపిలాస్ కూడలిలో బంద్ నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు



రాయగడ: నిర్మానుష్యంగా మారిన కపిలాస్ కూడలి



పర్లాకిమిడి: కొత్తబస్టాండు నుంచి బయలుదేరిన కార్మిక ఐక్యపోరాట సమితి నాయకులు



జయపురం: జయపురం ప్రధాన జంక్షన వద్ద ట్రేడ్ యూనియన్ నాయకుల ఆందోళన



కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాలో కార్మిక నాయకులతో మాజీ ఎంపీ ప్రదీప్ మజ్జి తదితరులు



కొరాపుట్: జయపూర్‌లో ఐఎన్‌టీయూసీ కొరాపుట్ జిల్లా అధ్యక్షుడు భగవాన్ బాహీనిపతి, బీజేడి నాయకుడు బాలారాయ్ ఆందోళన



పర్లాకిమిడి: పాతఅగ్నిమాపక దళం జంక్షన్ వద్ద ట్రేడ్ యూనియన్ల ఐక్య పోరాటంలో నేతలు



పర్లాకిమిడి: విలేకరులతో మాట్లాడుతున్న ఏ.ఐ.కె.ఎం.ఎస్.నాయకులు కేదార్ శోబోరో



జయపురం: భారత్ బందుకు మద్దతుగా పాల్గొన్న కాంగ్రెస్,బీజేడీ శ్రేణులు



భువనేశ్వర్: రైల్వేస్టేషన్ పట్టాలపై బైఠాయించిన ఆందోళనకారుల్ని తరలిస్తున్న పోలీసులు



భువనేశ్వర్: రాజ్‌మహల్ కూడలి ప్రాంతంలో ఆందోళనకారుల నిరసన



పర్లాకిమిడి : బస్టాండులో నిలిచిపోయిన ప్రైవేటు బస్సులు



జయపురం: బంద్ పాటిస్తున్న విద్యుత్ కర్మచారి ఫెడరేషన్ ప్రతినిధులు

దయితరిదాస్ బాబా కన్నుమూత



అలేఖ్ మత గురువు దయితరి దాస్ బాబా పార్థివదేహం

కొరాపుట్: ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో వేలాది అలేఖ్ మతస్తుల గురువు దయితరి దాస్ బాబా (80) తుదిశ్వాస విడిచారు. మంగళవారం నబరంగ్‌పూర్ జిల్లా చందాహండి సమితి దండాముండా గ్రామానికి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఘరియాబంద్ జిల్లా ఉర్మల్ అటవీ ప్రాంతంలోని ఆశ్రమంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఒడిశాలోని కలహండి, నబరంగ్‌పూర్ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఛత్తీస్‌గఢ్ తరలివెళ్లారు. అటవీ ప్రాంతాల్లో గిరిజనులు వ్యసనాలు వదిలి ఆధ్యాత్మిక భావజాలంలోకి అడుగు పెట్టడానికి బాబా ఎంతగానో కృషి చేశారు. అంతిమ యాత్రకు నబరంగ్‌పూర్ మాజీ ఎంపీ, మాజీ మంత్రి రమేష్ చంద్ర మజ్జి తదితరులు హాజరయ్యారు.



అంతిమ యాత్రలో పాల్గొన్న మాజీ మంత్రి రమేష్ చంద్ర మజ్జి

దళిత, మైనారిటీలపై దాడులు అరికట్టాలి



నబరంగ్‌పూర్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న మైనారిటీ సంఘాల నాయకులు



కలెక్టర్ శుభంకర్ మహాపాత్రోకు వినతి పత్రం సమర్పిస్తున్న సర్వమత పెద్దలు

కొరాపుట్: రాష్ట్రంలో దళిత, మైనారిటీ వర్గాల ప్రజలపై దాడులు అరికట్టాలని సర్వమత సమ్మేళనం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రోను బుధవారం సర్వమతస్తులు కలిశారు. గంజాం జిల్లాలో దళిత యువకులకు శిరోమండనం చేసి వీధుల్లో ఊరేగించారని, మల్కన్‌గిరి జిల్లాలో మతం మారినందుకు క్రైస్తవ మతస్తుల ఇళ్లపై దాడులు చేశారని కలెక్టర్‌కు వివరించారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులు కాలరాస్తూ అగ్రకుల మతోన్మాదులు చెలరేగిపోతున్నారని ఆరోపించారు. అనంతరం కలక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాల సంఘం అధ్యక్షుడు మున్నా త్రిపాఠి, క్రైస్తవ, ముస్లిం, ఆదివాసీ, హరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థిని వింత ప్రవర్తన!



పాఠశాలలో వింతగా ప్రవర్తిస్తున్న విద్యార్థిని పట్టుకొన్న తోటి విద్యార్థులు, ఉపాధ్యాయిరాలు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి చంద్రపాడ గ్రామం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలు పాఠ్యం బోధిస్తున్న సమయంలో హటాత్తుగా 10వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని అనూహ్యంగా, వింతగా ప్రవర్తించింది. నాకు సారా ఇవ్వండి, బీడీ ఇవ్వండి అని పట్టుబట్టింది. తాను ఇక్కడ నుంచి వెళ్లను, నేను వారిని చంపుతాను అని పిచ్చిగా మాట్లాడుతూ వింతగా ప్రవర్తించింది. ఆ సమయంలో రాష్ట్ర విద్యావిభాగ డైరెక్టర్, జిల్లా విద్యాధికారులు పాఠశాలకు వచ్చారు. వింతగా ప్రవర్తిస్తున్న బాలికను చూసిన అధికారులు వెంటనే హాస్పిటల్‌కు తీసుకువెళ్లాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆ సమయంలో విషయం తెలిసిన బాలిక సోదరుడు వచ్చి తన చెల్లెను హాస్పిటల్‌కు కాకుండా నేరుగా ఇంటికి తీసుకువెళ్లాడు. బాలిక పరిస్థితిని చూసిన తోటి విద్యార్థులు ఆమెకు దెయ్యమో, భూతమో ఆవహించిందని భయంతో వణికిపోయారు. బాలికను ఆదివాసీ వైద్యుడు దిశారీ వద్దకు తీసుకువెళ్లినట్లు తెలిసింది. మారుమూల ఆదివాసీ గ్రామీణ ప్రజలలో మూఢనమ్మకాలు ఇప్పటికీ ఉన్నాయని, వారిని చైతన్యవంతులను చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయురాలు రాజలక్ష్మీ మిశ్ర అభిప్రాయపడ్డారు. బాలికకు భూతం పట్టిందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. ఇటువంటి సంఘటనలకు మానసిక వ్యాధులే కారణమని, హాస్పిటల్‌లో వైద్యం చేయించటం మంచిదని విద్యావంతులు అభిప్రాయపడుతున్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం



మొక్కనాటుతున్న ఉపాధ్యాయులు



మొక్క నాటుతున్న విద్యార్థినులు

జయపురం: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని వక్తలు అన్నారు. జయపురం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో వన మహోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు బీకే భుయో మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ మొక్కలను నాటి వాటిని బాధ్యతగా సంరక్షించాలని అన్నారు. విద్యార్థుల పుట్టిన రోజు, పండుగ రోజుల్లో ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటడం అలవాటు చేసుకోవాలన్నారు. మొక్కలు నాటి వాటి సంరక్షిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. యూత్ అండ్ ఈకో క్లబ్బు సభ్యులు పాల్గొన్నారు.



మొక్కలకు నీరు పోసే విధానాన్ని వివరిస్తున్న ఉపాధ్యాయుడు

పూరీలో బర్డ్‌ఫ్లూ కలకలం



డెలాంగ్ ప్రాంతంలో కోళ్ల ఫారం వద్ద మరణించిన కోళ్లు

భువనేశ్వర్: పూరీ జిల్లా డెలాంగ్ ప్రాంతంలో బర్డ్ ఫ్లూ కలకలం రేగింది. బుధవారం డెలాంగ్ ప్రాంతంలోని కోళ్లఫారాల వద్ద వందలాది కోళ్లు చనిపోయాయి. ప్రధానంగా అంకులా, గొడిపుట్ మటియాపడా పరిరాల కోళ్ల ఫామ్ హౌస్‌లో కోళ్ల మరణాలు ఎక్కువగా సంభవించాయి. దీంతో కోళ్ళ పెంపకందారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు డెలాంగ్‌లో సుమారు 3 వేల కోళ్లు చనిపోయినట్లు సమాచారం. క్షేత్ర స్థాయిలో పరిస్థితిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక వైద్య బృందాన్ని నియమించారు. ప్రత్యేక వైద్య ఈ బృందం వివిధ కోళ్ల ఫారాలు సందర్శించి అవసరమైన పరీక్షలు నిర్వహిస్తోంది. పరిపాలన 3 మంది సభ్యులతో కూడిన వైద్య బృందం ప్రభావిత ప్రాంతాల్ని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తోంది.



ప్రభావిత ప్రాంతాల్లో వైద్య బృందం పరిశీలన

రైల్వే వంతెన మంజూరు చేయాలి



పాడువాలో బహుదా రథాయాత్ర రోజున రైల్వే ట్రాక్‌పై భక్తులు

• నందపూర్ సమితి వాసుల డిమాండ్



రైల్వే ట్రాక్ దాటుతున్న విద్యార్థినులు



నిత్యం ఇదే పరిస్థితి..

కొరాపుట్: అవసరమున్న చోట రైల్వే వంతెన లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి పాడువా సమీపంలో డర్లిపుట్ వైపు ప్రజలు రైల్వే వంతెన కావాలని విజ్ఞప్తులు చేస్తున్నారు. ఇటీవల జరిగిన బహుడా రథాయాత్ర రోజున రోడ్డు పక్కనే ఉన్న రైల్వే ట్రాక్ మీద భక్తులు అధిక సంఖ్యలో కూర్చుని సేద తీరారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అదే సమయంలో రైళ్లు వస్తే పరిస్థితి ఏమిటని ఈ ప్రాంతీయులు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ రోజూ బాలలు ట్రాక్ దాటుకుంటూ పాఠశాలలకు వెళ్తుంటారు. అక్కడ ఉన్న స్థల పరిస్థితి ప్రకారం ఫుట్‌పాత్ వంతెన నిర్మించాలని ప్రజలు చిరకాలంగా డిమాండ్ చేస్తున్నారు. గతంలో రైల్వే అధికారులు సర్వే చేసి వెళ్లారు. కానీ ఇంత వరకు వంతెన మంజూరుపై ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వంతెన నిర్మాణం చేసి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

పాముకాటుతో బాలిక మృతి



షన్విత(ఫైల్)

కవిటి: మండలంలోని పాత శిలగాం పూడివీధికి చెందిన గొనప షన్విత(11) అనే బాలిక పాముకాటుతో మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సోమవారం అర్ధరాత్రి ఇంట్లో పడుకొని ఉన్న సమయంలో పాము కాటు వేసింది. దీంతో బాలిక ఉదయం లేచిన తర్వాత విపరీతంగా వాంతులు చేసుకుంటూ అపస్మారక స్థితికి వెళ్లడంతో సోంపేట ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యమందించారు. పరిస్థితి విషమించడంతో బాలిక చికిత్స పొందుతూనే మంగళవారం మృతి చెందింది. శిలగాం ఉన్నత పాఠశాలలో బాలిక ఆరో తరగతి చదువుతోంది.

రోడ్డు ప్రమాదంలో కార్యదర్శికి గాయాలు



గాయాలతో పడి ఉన్న కార్యదర్శి అప్పారావు

మెళియాపుట్టి: మండలంలోని చాపర గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న చింతల అప్పారావు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం సాయంత్రం విధులు ముగించుకుని స్వగ్రామం కొరసవాడకు వెళ్లే క్రమంలో ఒడిశా రామసాగరం గ్రామం వద్ద ఆయన ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయారు. దీంతో అక్కడే ఉన్నటువంటి కొంత మంది వ్యక్తులు 108కు సమాచారం అందించారు. అక్కడి నుంచి ఒడిశా పర్లాఖిమిడి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో కుటుంబ సభ్యులు శ్రీకాకుళం తరలించినట్లు తెలుస్తోంది. అయితే ప్రమాదానికి గల కారణాలు తెలియలేదు.

పాముల సయ్యాట



పాముల సయ్యాట

కొత్తూరు: మండల కేంద్రంలోని ఎస్ఎస్ కాలనీలో మంగళవారం రాత్రి పాములు సయ్యాటాడుతూ కనిపించాయి. కాలనీలోని ప్రజలంతా ఆసక్తిగా గమనించారు. అయితే ప్రజలు సంచరిస్తున్న ప్రాంతాల్లో ఇటువంటి ఘటన జరగడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

గంజాయితో ఇద్దరు యువకులు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సూర్యనారాయణ

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు సుమారు నాలుగు కేజీల గంజాయి తరలిస్తూ కాశీబుగ్గ పోలీసులకు పట్టుబడ్డారు. తమిళనాడు రాష్ట్రం చెన్నైకు చెందిన రామ్మూర్తి దినేష్‌కార్తీక్ ఒడిశాలో 4 కేజీల గంజాయి కొనుగోలు చేసి తిరిగి చెన్నై వెళ్లేందుకు పలాస రైల్వే స్టేషన్‌కు వెళ్తున్న క్రమంలో కాశీబుగ్గ పోలీసులు పట్టుకున్నారు. కటక్‌కు చెందిన చిత్తరాంజన్ దాస్ అనే వ్యక్తి పర్లాకిమిడిలో 2 కేజీల గంజాయిని కొనుగోలు చేసి కటక్ వెళ్లేందుకు పలాస రైల్వే స్టేషన్ వెళ్తున్న క్రమంలో కాశీబుగ్గ పోలీసులకు పట్టుబడ్డాడు. వీరిద్దరి నుంచి 6 కేజీల గంజాయి, మొబైల్ ఫోన్‌ను స్వాధీనపరచుకున్న పోలీసులు కేసు నమోదుచేసి ఇరువురిని కోర్టులో హాజరుపరుస్తున్నట్లు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ వెల్లడించారు.

బరితెగించిన ఆక్రమణదారులు



ఆక్రమించిన స్థలం ఇదే...

సంతబొమ్మాళి: మండలంలోని పోతునాయుడుపేట గ్రామంలో ఆక్రమణదారులు బరితెగించారు. సాగునీటి కాలువ, రోడ్డుకు మధ్య ఉన్న సుమారు 30 సెంట్లు స్థలం కబ్జా చేశారు. ఆక్రమించిన స్థలంలో ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వం వేసిన తాగునీటి బోరును పీకేసి ఆనవాలు లేకుండా చేశారు. దీంతో తాగునీటికి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఆక్రమణదారులను గ్రామస్తులు ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడడంతో భయపడి ఫిర్యాదు కూడా చేయలేదు. దీంతో పాటు రోడ్డుకు అనుకొని ఉన్న బెర్మ్‌తో పాటు సాగునీటి కాలువ గట్టును కూడా ఆక్రమించి మట్టిని వేసి కబ్జా చేశారు. ఆక్రమించిన స్థలంలో విద్యుత్ స్తంభాలు ఉండడంతో అవి కూడా తొలగించమని సంబంధిత కాంట్రాక్టర్‌తో ఆక్రమణదారులు గొడవపడిన సంఘటనలు ఉన్నాయి. ఆక్రమించిన స్థలంలోని 11 సెంట్లును వేరొక వ్యక్తికి ఆక్రమణదారులు అమ్మి తప్పుడు సర్వే నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేయించారని పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై రెవెన్యూ ఉన్నతాధికారులు లోతుగా దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తహసీల్దార్ హేమసుందర్‌ను దీనిపై వివరాలు అడుగగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

గజపతిలో అధికారుల పర్యటన



ఐటీడీఏ శాఖ ఆవరణలో మొక్కను నాటిన కేంద్ర పౌరసరఫరాలు, సంక్షేమ సంచాలకులు సునీల్ సచ్‌దేవ్



ఆర్.ఉదయగిరి బ్లాక్‌లో అబార్‌సింగిలో పీడీఎస్ బియ్యం తనిఖీ చేస్తున్న కేంద్ర పౌరసరఫరాల సంచాలకులు సునీల్ సచ్‌దేవ్



రాగిడి పంచాయతీ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర పౌరసరఫరాల సంచాలకులు సునీల్ సచ్‌దేవ్



జిల్లా కలెక్టర్‌తో కేంద్ర పౌరసరఫరాల శాఖ సంచాలకులు సునీల్ సచ్‌దేవ్, ఇతర అధికారులు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో కేంద్ర పౌరసరఫరాలు, క్యాంప్ సంక్షేమ సంచాలకులు సునీల్ సచ్‌దేవ్, జాతీయ ఆహార భద్రత చట్ట కేంద్రీయ ప్రాజెక్టుల మానిటరింగ్ అధికారి సచిన్ కుమార్, ఆకాంక్ష బ్లాకులు గుమ్మా, ఆర్.ఉదయగిరిలో బుధవారం పర్యటించారు. వారితో సబ్ కలెక్టర్ అనుప్ పండా, అదనపు జిల్లా పౌరసరఫరాల అధికారిని స్నేహాసినీ బెహరా, ఆర్.ఉదయగిరి బీడీఓ. నారీమస్ ఖర్సల్, తాహాసిల్దార్లు వున్నారు. ఆకాంక్ష మండలాలు ఆర్.ఉదయగిరి, గుమ్మా సమితుల్లో కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ పథకాలను వారు సమీక్షించారు. కేంద్ర పౌరసరఫరాలు, సంక్షేమ శాఖ డైరక్టర్ సునీల్ సచ్‌దేవ్, సచిన్ కుమార్ తొలుత ఆర్.ఉదయగిరి బ్లాక్ అబార్ సింగి, శవరపల్లి గ్రామ పంచాయతీలలో పథకాలను లబ్ధిదారులకు అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. గుమ్మా బ్లాక్‌లో రాగిడి, తరబ పంచాయతీల్లో అమలు జరుగుతున్న కేంద్ర పథకాలు రేషన్ డిపోల వద్దకు వెళ్లి పి.డి.ఎస్.బియ్యం నాణ్యతను తనిఖీలు చేశారు. అనంతరం పర్లాకిమిడిలో ఆర్.ఉదయగిరి ప్రాంతీయ నియంత్రణ బజార్ కమిటీ గోడౌన్‌లో బియ్యం స్టోరేజీ, రేషన్ బియ్యం బస్తాల స్టాక్‌ను తనిఖీలు చేపట్టారు. తర్వాత కలెక్టరేట్‌కు చేరుకుని పాలనాధికారి బిజయకుమార్ దాస్‌తో ఇద్దరు కేంద్ర అధికారులు కలిసి పర్యటన విశేషాలను మాట్లాడారు. గజపతి జిల్లాలో ప్రాథమిక విద్య, ఆరోగ్యం, పౌరసరఫరాలు, జనవనరులు మౌలిక సమస్యలపై కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ప్రజలకు అందాల్సిన పీఎం జనమణ యోజనా పథకం, మన్‌రేగా, స్వచ్ఛభారత్ అభియాన్, ప్యాక్స్ గుమ్మా, కేంద్ర ఆయుష్మాన్ భారత్ పథకాలు అమలుపై చర్చించారు. తిరిగి ఇద్దరు కేంద్ర అధికారులు భువనేశ్వర్ పయనమయ్యారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టలేదని నిరసన



రోడ్డుపై నాట్లు నాటి నిరసన తెలియజేస్తున్న ప్రజలు

జయపురం: రోడ్డు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇబ్బందులుపడుతున్నామంటు జనం నిరసనకు దిగారు. జయపురం సబ్‌డివిజన్ బోయిపరిగుడ సమితి దొండాబడి పంచాయతీ నుండి పనసపుట్ గ్రామం మీదుగా జంగోలజోడి గ్రామం వరకు ఉన్న రోడ్డు పంట పొలంలా మారడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో రోడ్డుకు మరమ్మతులు లేదా పునఃనిర్మాణం చేయాలని ఆ ప్రాంత ప్రజలు ఎంతో కాలంగా సమితి, జిల్లా అధికారులకు విజ్ఞప్తులు చేస్తున్నారు. అయితే నిమ్మకు నీరెత్తినట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో గ్రామస్తులు వినూత్న రీతిలో బుధవారం నిరసనకు దిగారు. పంట పొలంలా ఉన్న రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేవారు. గ్రామస్తులు వివరణ ప్రకారం తమ గ్రామానికి రోడ్డు వేయాలని అధికారులకు విన్నవించుకోగా దొండాబడి నుంచి జంగొలజొడి గ్రామం వరకు 2019లో తారు రోడ్డు వేశారన్నారు. అయితే రోడ్డు నాణ్యత లేక పోవటంతో రెండు నెలలకే శిథిలమై గతుకులుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి నుంచి ఈ విషయం సంబంధిత అధికారులకు తెలియజేసినప్పటికీ సమస్యను పరిష్కరించలేదని గ్రామ పెద్ద బిజయ ఖొర ఆరోపించారు. రోడ్డు బాగు చేయకపోవటంతో గ్రామానికి అంబులెన్స్ కూడా రావడం లేదని.. దీంతో అత్యవసర సమయంలో రోగులు, గర్భిణులు, మహిళలు వెళ్లిలేకపోతున్నారన్నారు. అలాగే పాఠశాలలు, కళాశాలలకు వెళ్లలేక పిల్లలు అవస్థలు ఎదుర్కొంటున్నట్టు వాపోయారు. ఇప్పటికైనా రోడ్డు పనులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరారు.

రిజర్వాయర్‌లో పడి వృద్ధుడు మృతి



మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చుతున్న దృశ్యం

కొరాపుట్: జోలాపుట్ రిజర్వాయర్‌లో పడి వృద్ధుడు మృతి చెందాడు. కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి పాడువా పోలీస్ స్టేషన్ పరిధిలోని జోలాపుట్ రిజర్వాయర్ పరిధి రెంటా గ్రామ సమీపంలో ఉన్న పర్వ ఘాట్ వద్ద జోడిపుట్ గ్రామానికి చెందిన సామ్ కిలో (60) స్నానానికి దిగి నీటిలో గల్లంతయ్యాడు. ఉదయం స్నానం కోసం వెళ్లిన సామ్ కిలో సాయంత్రం వరకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. సాయంత్రం సమయంలో రిజర్వాయర్ మృతదేహం తేలియాడుతూ కనిపించడంతో కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని పోలీసులు ఒడ్డుకు చేర్చారు. పాడువా ఎస్ఐ దీపక్ బారిక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారా కేసులో మహిళకు జైలు శిక్ష

పలాస: మండలంలోని రెంటికోట గ్రామానికి చెందిన కబోది తులసికి నాటుసారా కేసులో 12 నెలల జైలుశిక్షతో పాటు రూ.2 లక్షల జరిమానా విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి బుధవారం తీర్పునిచ్చారు. ఈ విషయాన్ని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.మల్లికార్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2022 ఏప్రిల్ 16న ఆమె వద్ద అక్రమంగా 5 లీటర్ల నాటుసారా ఉండడంతో అప్పటి సబ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.రమేష్ వాదించారు. ఈ కేసు నేరం రుజువు కావడంతో తుది తీర్పును ఇచ్చారని ఆయన తెలిపారు.

అయ్యో అన్నదాత..!





సాగునీరు లేక బీడుగా మారిన కొఠారీ పంట పొలాలు

- పత్తా లేకుండా పోయిన సీఎం చంద్రబాబు హామీ
- మూలకు చేరిన ఈదుపురం ఎత్తిపోతల పథకం
- మొదలైన ఖరీఫ్ కష్టాలు

ఇచ్ఛాపురం రూరల్: 'ఖరీఫ్ నాటికి ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. రైతుల వినతి మేరకు మూలకు చేరిన ఈదుపురం ఎత్తిపోతల పథకాన్ని రూ.9 కోట్లతో పునరుద్ధరిస్తాం' అని గతేడాది నవంబర్ 1వ తేదీన ఈదుపురం గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పిన మాటలు ఇవి. ఈ మాటలు చెప్పి నేటికి 8 నెలలు కావస్తున్నా ఎత్తిపోతల పథకం కోసం ఇప్పటివరకు నయా పైసా కూడా విడుదల చేయలేదు. దీంతో సీఎం హామీపై ఆశలు పెట్టుకున్న అన్నదాతకు అవస్థలు తప్పడం లేదు.

1,200 ఎకరాలకు సాగునీరు

ఇచ్ఛాపురం మండలం కొఠారీ, పూర్ణాటకం, పత్రిపుట్టుగ, ధర్మపురం గ్రామాలతో పాటు కవిటి మండలంలోని భైరిపురం, వింధ్యగిరి, రాజపురం, లండారిపుట్టుగ గ్రామ పరిసర ప్రాంతాల్లో ఉండే 1200 ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించే ఏకైక ఎత్తిపోతల పథకం జైకిసాన్ ఎత్తిపోతల పథకం. ఈదుపురం బాహుదా నది పక్కన 2004లో నిర్మించారు. కేవలం వర్షాధారంపై పండించే ఈ ప్రాంత రైతులకు జైకిసాన్ ఎత్తిపోతల పథకం వరంగా మారింది. రబీ, ఖరీఫ్ సీజన్లలో రైతులు సక్రమంగా పంటలను పండించుకునేవారు. అయితే 2009లో కురిసిన భారీ వర్షాలకు బాహుదా నది ఉప్పొంగడంతో ఎత్తిపోతల పథకం నీట మునిగింది. దీంతో యంత్రాలు పాడైపోయాయి. అయితే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయడంతో మరో ఐదేళ్ల పాటు రైతులకు సాగునీటి ఇబ్బందులు తీరాయి. 2018 అక్టోబర్‌లో వచ్చిన తిత్లీ తుఫాన్‌కు బాహుదా వరద నీటిలో ఎత్తిపోతల పథకం 15 రోజుల పాటు ఉండిపోవడంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు ఎత్తిపోతల పథకానికి సంబంధించి యంత్రాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో అప్పటినుంచి ఏడేళ్లుగా 1200 ఎకరాలకు సాగునీరు అందకపోవడంతో అక్కడి రైతులు అవస్థలు పడుతున్నారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీతో ఈ ఏడాది ఖరీఫ్ కష్టాల నుంచి గట్టెక్కుతాం అనుకున్న రైతులకు అడియాసలే మిగిలాయి. రూ.9 కోట్లతో ఎత్తిపోతల పథకానికి పూర్వ వైభవం తెస్తామన్న ఆయన హామీ నీటిమూటగా మిగిలిపోయింది.



మూలకు చేరిన ఈదుపురం ఎత్తిపోతల పథకం



వర్షాలపై ఆశలతోనే పొలాలను బాగు చేస్తున్న ధర్మపురం రైతులు

చుక్క నీరు లేదు

ఈదుపురం ఎత్తిపోతల పథకానికి ఆనుకొని ఉన్న భూములకు చుక్క సాగునీరు లేకుండా పోయింది. దీంతో రైతులు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతంలో నాకు రెండు ఎకరాల పంట పొలం ఉంది. గతంలో ఎత్తిపోతల పథకం ద్వారా రబీ, ఖరీఫ్ సీజన్లలో సాగునీరు అందడం మూలంగా ఆనందంగా పంటలు పండించుకునేవాళ్లం. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా పోయింది. ప్రభుత్వం సత్వరమే పథకాన్ని పునరుద్ధరిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

– సంధాన పూర్ణచంద్రుడు, డి.గొనపపుట్టుగ, కవిటి

సీఎం హామీ ఏమైంది

సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీకే పత్తా లేకుండా పోయింది. రూ.9 కోట్లతో జైకిసాన్ ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధించడం జరుగుతుందని ఆయన చెప్పడంతో వందలాది మంది రైతులు సంతోషించారు. ఈయన హామీకి నేటికి ఎనిమిది నెలలు కావస్తోంది. 2016లో కొఠారీ ఉమ్మడి చెరువు వద్ద పైపులైన్ ధ్వంసం కావడంతో శివారు ప్రాంతాలకు సాగునీరు అందకుండా పోయింది. రైతుల పరిస్థితిని అర్థం చేసుకొని పథకానికి జీవం పోస్తే మంచి జరుగుతుంది.

– దుక్క ధనలక్ష్మి, సర్పంచ్, కొఠారీ, ఇచ్ఛాపురం

గురువులే సమాజ మార్గదర్శకులు



పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న, రంజన్ త్రిపాఠి, తదితరులు

కొరాపుట్: సమాజానికి గురువులే మార్గదర్శకులని నిఖిల ఉత్కళ ప్రాథమిక ఉపాధ్యాయుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమణి రంజన్ త్రిపాఠి పేర్కొన్నారు. బుధవారం జయపూర్ పట్టణంలో లేబర్ ఆఫీస్ జంక్షన్ వద్ద బీఈఓ కార్యాలయంలో జరిగిన ఉపాధ్యాయుల పదవీ విరమణ సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రాథమిక విద్యతోనే సమాజానికి పునాదులు పడతాయన్నారు. వెనకబడిన కొరాపుట్ జిల్లాలో పాఠశాలలకు వెళ్లడానికి సరైన మార్గాలు లేనప్పటికీ ఉపాధ్యాయులు విధి నిర్వహణలో వెనకడుగు వేయడం లేదన్నారు. పదవీ విరమణ చేసిన 10 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. కొరాపుట్ జిల్లా నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శశి భూషణ్ దాస్, బీఈఓ చందన్ కుమార్ పట్నాయక్, ఉపాధ్యాయుల సంఘం జయపూర్ విభాగ అధ్యక్షురాలు భారతీ హోత్త, తదితరులు పాల్గొన్నారు.

4 కిలోమీటర్లు డోలీమోత



మంచంపై గర్భిణిని తరలిస్తున్న గిరిజనులు

కొరాపుట్: నిండు గర్భిణిని మంచంపై నాలుగు కిలోమీటర్లు దూరం తరలించిన విషాదకర ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. బుధవారం కలహండి జిల్లా భవానిపట్న సమితి జుగసాయి పట్న గ్రామ పంచాయితీ కద్రసోరు గ్రామంలో సనలక్నా మజ్జి సతీమణి అంద్రాణి మజ్జి పురిటి నొప్పులు మొదలయ్యాయి. దీంతో స్థానికులు 108 అంబులెన్సుకు సమాచారమిచ్చారు. అయితే సిబ్బంది కమలై గ్రామం వద్దకు వచ్చి రోడ్డు లేక ఆగిపోయారు. సమాచారం తెలిసిన గిరిజనులు మంచాన్ని డోలీలా తయారుచేసి బాధితురాలిని లంజిగడ్ ఆస్పత్రికి తరలించారు.

వరి విత్తనాల పంపిణీ



సేంద్రియ ఎరువులు, వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

రాయగడ: స్థానిక సొలర్ ఫౌండేషన్ ప్రతినిధులు బుధవారం సమితిలోని పితామహాల్, తడమ, కుర్లి, బొడొ అలుబడి తదితర గ్రామాల్లోని 120 మంది ఆదివాసీ రైతులకు ఉచితంగా సేంద్రియ ఎరువులు, వరి విత్తనాలను పంపిణీ చేశారు. సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేస్తే అధిక దిగుబడితోపాటు భూమి సారవంతంగా ఉంటుందని సంస్థకు చెందిన సభ్యులు ధర్మా మండంగి, అభి మాఝి అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువులు, విత్తనాల వినియోగం వల్ల కలిగే లాభాలను తెలియజేశారు.

అన్నం తినలేక..

పస్తులు ఉండలేక

- మధ్యాహ్న భోజనంలో పురుగులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న దృశ్యం

కంచిలి: మండలంలోని కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వండుతున్న అన్నంలో పురుగులు దర్శనమిస్తున్నాయి. ఇక్కడ సన్నబియ్యంతో వండిన అన్నంలో కొద్ది రోజులుగా పురుగులు వస్తుండడంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కూరగాయల అన్నం, ఉడకబెట్టిన కోడిగుడ్డు, బంగాళ దుంపలు కూర, వేరుశనగ చిక్కీను వడ్డించారు. అయితే కూరగాయల అన్నంలో కొందరు విద్యార్థులకు పురుగులు దర్శనమిచ్చాయి. ఇక్కడ కొద్దిరోజులుగా ఇదేవిధంగా అన్నంలో తెల్లటి పురుగులు వస్తున్నాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు చెబుతున్నారు.

రెండో'సారీ'

ఇటీవల ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి వెంకటేశ్వర పాణిగ్రాహి బియ్యాన్ని తనిఖీ చేసి, మొదటి బ్యాచ్‌లో సరఫరా చేసిన రెండు ప్యాకెట్ల పాత నిల్వ ఉన్న బియ్యాన్ని వెనక్కి తీసుకెళ్లారు. అయితే రెండో బ్యాచ్‌లో మళ్లీ సరఫరా చేసిన బియ్యంలో కూడా తెలుపు, నలుపు రంగుల్లో పురుగులు వస్తున్నాయని వంట చేస్తున్న ఏజెన్సీ మహిళలు తెలిపారు. దీనిపై పాఠశాల హెచ్ఎంకు సమాచారం ఇవ్వడంతో ఆయన స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఇలా ప్రతిరోజు విద్యార్థులకు పెడుతున్న అన్నంలో పురుగులు వస్తుండడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కూరగాయల అన్నంలో పురుగు



బుధవారం పాఠశాల మధ్యాహ్న భోజనం మెనూలో వడ్డించిన కూరగాయల అన్నంలో నల్లటి పురుగులు వచ్చాయి. ఈ మధ్య కాలంలో ప్రతిరోజూ ఇదే విధంగా పురుగులు వస్తున్నాయి. దీంతో సరిగా అన్నం తినలేకపోతున్నాం.

– ఎల్.చందు, ఆరో తరగతి విద్యార్థి

అన్నం తినలేకపోతున్నాను



ప్రతిరోజు మధ్యాహ్న భోజనంలో పురుగులు వస్తున్నాయి. ఈ అన్నం తినలేకపోతున్నాను. తింటుంటే ముద్ద దిగడం లేదు. ఆకలికి తట్టుకోలేక తినక తప్పడం లేదు.

– పి.గంగాధర్, ఆరో తరగతి విద్యార్థి

తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్నాం



గత కొద్దిరోజులుగా సన్న బియ్యం సరఫరా చేసిన వాటిలో పురుగులు వస్తున్నాయి. ఈ విషయంపై విద్యార్థులు, పాఠశాల వంట ఏజెన్సీవారి నుంచి ఫిర్యాదులు అందడంతో స్వయంగా పరిశీలించాను. దీంతో బియ్యాన్ని చేటలతో శుభ్రం చేసి వండమని సూచించాను. అయినప్పటికీ తెలుపు రంగు పురుగులు వండిన తర్వాత బయటపడుతున్నాయి. బియ్యాన్ని మార్చాల్సిందిగా తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్నాం.

– ఎన్.చాణక్య, హెచ్ఎం, కంచిలి జెడ్పీహెచ్ స్కూల్

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని కానుకుర్తివారి వీధిలో భార్యతో మనస్పర్థల కారణంగా బుధవారం ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు వెల్లడించారు. కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం మధురపేటకు చెందిన మధుర శ్రావ్య, నాగేంద్రలు మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుని ఉపాధి నిమిత్తం శ్రీకాకుళం నగరానికి వచ్చారు. వీరికి సంవత్సరం బాబున్నాడు. ఆరునెలల నుంచి బట్టల షాపులో పనిచేస్తున్న నాగేంద్ర ఒక అమ్మాయితో తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండడాన్ని భార్య శ్రావ్య గమనించి మంగళవారం రాత్రి అడిగింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన నాగేంద్ర బుధవారం భార్య నిద్రలో ఉండగా స్లాబ్ హుక్‌కి చున్నీతో ఉరి వేసుకున్నాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

క్లుప్తంగా

గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు

● జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్



గ్రంథాలయ సంస్థ బడ్జెట్‌ను వివరిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్, జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జి ఎస్.సేతమాధవన్ ఆదేశించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ బడ్జెట్ సమావేశం జేసీ చాంబర్‌లో బుధవారం నిర్వహించారు. పౌర గ్రంథాలయ శాఖ డైరెక్టర్ సూచనలు, కేటాయించిన బడ్జెట్‌కు అనుగుణంగా త్వరలో జరగబోయే సర్వసభ్యసమావేశం గురించి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తీసుకోవాల్సిన చర్యలు, నిధులు కేటాయింపుపై సమావేశంలో చర్చించారు. ఆన్ డిమాండ్ పుస్తకాల కోసం రూ.3 లక్షలు, బిల్డింగ్ నిర్మాణానికి రూ.50 లక్షలు, ఇతర పుస్తకాల కొనుగోలుకు రూ.లక్ష కేటాయిస్తున్నట్టు జేసీ ప్రకటించారు. దీనిని కమిటీ సభ్యులు ఆమోదించారు. సమావేశంలో వయోజనవిద్యాశాఖ ఇన్‌చార్జి డీడీ సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి డీపీఆర్‌ఓ ఎం.మల్లేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి, డివిజనల్ పంచాయతీ అధికారి శిరీష పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు జీతాలేవీ?



విలేకరులతో మాట్లాడుతున్న రామారావు

రాజాం సిటీ: నెలలో 9 రోజులు గడిచాయి.. ఇప్పటికీ చాలా మంది ఉపాధ్యాయులకు జీతాలు అందలేదని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేకేటి రామారావు అన్నారు. స్థానిక విలేకరులతో ఆయన బుధవారం మాట్లాడుతూ పాత జిల్లాల ప్రాతిపదికన గత నెలలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు ఇప్పటివరకు జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. కేడర్ స్ట్రెన్త్ అప్‌డేట్ చేసే సాంకేతిక సమస్యను ట్రెజరీ అధికారులు పరిష్కరించేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టి జీతాలు త్వరితగతిన అకౌంట్‌కు జమయ్యేలా చూడాలని కోరారు. జీతాలు అందకపోవడంతో ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నాయని, ఈఎంఐలు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట బీటీఏ జిల్లా నాయకులు అనిల్ తండాడి, నాస సింహాచలం ఉన్నారు.

11న ఏపీ ఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల రాక

విజయనగరం అర్బన్: ఏపీ ఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడిగా, జేఏసీ చైర్మన్‌గా ఎన్నికైన విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జేఏసీ డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా ఎన్నికైన డీవీరమణ ఈ నెల 11న తొలిసారి జిల్లాకు రానున్నారని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.శ్రీధర్‌బాబు, సురేష్, సహ అధ్యక్షులు జీవీఆర్ఎస్ కిశోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారికి వై జంక్షన్‌లో ఘన స్వాగతం పలుకుతామన్నారు. అక్కడి నుంచి జెడ్పీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీతో స్వాగతిస్తామని చెప్పారు. మధ్యాహ్నం జెడ్పీ సమావేశ మందిరంలో జిల్లా, తాలూకా యూనిట్ కార్యవర్గం, జేఏసీ మిత్ర సంఘాల కార్యవర్గంతో సమావేశం నిర్వహించి అనంతరం ఘనంగా సత్కరిస్తామని తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, యూనిట్ కార్యవర్గ సభ్యులు హాజరుకావాలని కోరారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు


నెల్లిమర్ల రూరల్: మండలంలోని జరజాపుపేట గ్రామానికి చెందిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మరో గ్రామానికి చెందిన బాలికను ఇంటర్ చదివే సమయంలో పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా అనుభవించి మోసం చేశాడని బాధిత బాలిక ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేపడతామని పేర్కొన్నారు.

తారకరామకు మోక్షమెప్పుడో?




నిర్మాణం నిలిచిపోయిన తారకరామ తీర్థసాగర్ స్పిల్‌వే

● 20 ఏళ్లయినా పూర్తికాని ప్రాజెక్టు పనులు
● రూ.804 కోట్లకు పెరిగిన నిర్వహణ వ్యయం
● పనుల్లో అంతులేని జాప్యం
● పట్టించుకోని ప్రభుత్వం



తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్టు వ్యయం, ఆయకట్టు ఎకరాల చిత్రం



చంపావతి నదీ పరీవాహక ప్రాంతంలోని తారక రామ తీర్థ సాగర్ బ్యారేజీ స్థాన చిత్రం

పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేస్తేనే పనులు

కూటమి ప్రభుత్వంలో సరిపడా నిధులు వస్తేనే 2026 చివరికైనా తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురాగలం. ఈ ప్రాజెక్టు ద్వారానే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి నీరందించాల్సి ఉంది. ప్రాజెక్టు వ్యయం రూ.804 కోట్లకు పెరగడంతో ఇప్పుడు ఈ ప్రభుత్వం విడుదల చేసే నిధులు ఏ కోశానా సరిపడవు. పై మొత్తం నిధులు విడుదలైతేనే 2026 డిసెంబర్ నాటికి విజయనగరం పట్టణానికి, భోగాపురం విమానాశ్రయానికే కాకుండా సుమారు 20 వేల ఎకరాలకు కూడా నీరందించగలం. – అప్పలనాయుడు, తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్టు ఈఈ

విజయనగరం గంటస్తంభం: రెండు దశాబ్దాలుగా సాగుతున్న ప్రాజెక్టు తారకరామ తీర్థసాగర్. 2005 ఫిబ్రవరి 19న ప్రారంభించిన ప్రాజెక్టు అంచెలంచెలుగా అంచనా వ్యయం పెరుగుతోందే తప్ప పనులు మాత్రం పూర్తి కావడం లేదు. రాష్ట్రంలో 15 ఏళ్ల పాటు సీఎంగా బాధ్యతలు నిర్వర్తించిన చంద్రబాబునాయుడు ఏనాడూ ప్రాజెక్టు పూర్తికి చిత్తశుద్ధితో చర్యలు తీసుకోలేదు. ఉత్తరాంధ్రలో అత్యంత కీలకమైన ప్రాజెక్టును పూర్తి చేయడానికి గత వైఎస్ జగమోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ ప్రాజెక్టులో అంతర్భాగమైన కుమిలి రిజర్వాయర్‌లో మిగిలిన పనులను రూ.150.24 కోట్లతో పూర్తి చేయాలని జలవనరుల శాఖ అధికారులకు ఆదేశాలిచ్చింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే విజయనగరం జిల్లాలోని పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం మండలాల్లో గల 49 గ్రామాల్లోని 24,710 ఎకరాలకు సాగు నీరందుతుంది.

భూసేకరణే అసలు సమస్య..

తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్టుకు అవసరమైన 3497.58 ఎకరాల భూమికిగాను 3278.32 ఎకరాలను సేకరించారు. మిగతా 219.26 ఎకరాల సేకరణపై అధికారులు దృష్టిపెట్టారు. కుమిలి రిజర్వాయర్ ప్రాజెక్టులో కోరాడపేట, ఏటీ అగ్రహారం, పడాలపేట ముంపునకు గురవుతాయి. ఈ గ్రామాల్లోని 2,219 కుటుంబాలకు పునరావాసానికే రూ.209.88 కోట్లు అవసరం. అయితే ప్రభుత్వం తాజాగా కేవలం రూ.5కోట్లు మాత్రమే కేటాయించింది. తాడిపల్లి, కుదిపి, నీలంరాజు పేట గ్రామాల నిర్వాసితులకు పరిహారానికి రూ.75.69 కోట్లు ఖర్చవుతుంది. ప్రాజెక్టు పనులు పూర్తయ్యేలోగా నిర్వాసితులకు పునరావాసం కల్పించాల్సి ఉంది. నిర్వాసితులకు పునరావాసం కల్పించాక చంపావతి నుంచి నీటిని మళ్లించి, ఆయకట్టుకు నీళ్లందించడంతో పాటు విజయనగరం కార్పొరేషన్‌కు తాగునీరు సరఫరా అవకాశం కుదురుతుంది.

ప్రాజెక్టు నిర్మాణం ఇలా..

వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జలయజ్ఞంలో భాగంగా తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. విజయనగరం జిల్లా గుర్ల మండలం కోటగండ్రేడు వద్ద చంపావతి నదిపై 184 మీటర్ల పొడవున బ్యారేజీ నిర్మించి అక్కడి నుంచి 13.428 కిలోమీటర్ల కాలువ ద్వారా కుమిలిలో నిర్మించే రిజర్వాయర్‌కు 27 టీఎంసీల నీటిని మళ్లిస్తారు. ఇక్కడి నుంచి కుమిలి చానల్ సిస్టం పరిధిలోని 8,172 ఎకరాలను స్థిరీకరించడంతో పాటు కొత్తగా 16,538 ఎకరాలకు సాగునీందించాలి. వైఎస్సార్ మరణానంతరం అధికారంలోకి వచ్చిన పాలకులు ప్రాజెక్టు పనులు పట్టించుకోలేదు. 2014 నుంచి 2019 మధ్య పాలన సాగించిన చంద్రబాబునాయుడు ప్రాజెక్టు పనుల ఊసెత్తలేదు. అనంతరం అధికారం చేపట్టిన వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రాజెక్టులో అంతర్భాగమైన బ్యారేజీ నిర్మాణాన్ని దాదాపు పూర్తిచేశారు. మళ్లింపు కాలువ, కుమిలి రిజర్వాయర్ పనులు పెడింగ్‌లో ఉన్నాయి. కుమిలి రిజర్వాయర్ డైక్-2, డైక్-3లలో 2.2 కిలోమీటర్ల మట్టికట్ట పనుల్లో రూ.150.24 కోట్ల పనులు మిగిలాయి. వాటిని చేపట్టిన కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. దీంతో 60-సీ నిబంధన కింద కాంట్రాక్టర్‌ను తొలగించి, పనులను మరో కాంట్రాక్టర్‌కు అప్పగించడానికి అధికారులు సిద్ధమయ్యారు. ఆ మేరకు ప్రతిపాదనలను జ్యూడిషియల్ ప్రివ్యూకు పంపారు.

తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు ప్రాజెక్టు కీలకం

విజయనగరం పట్టణానికి తాగునీరు, భోగాపురం విమానాశ్రయానికి నీటి అవసరాలను తీర్చడమే కాకుండా సుమారు 20వేల ఎకరాలకు పైగా సాగు నీరు అందించే తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు నిర్మాణం ఎంతో అవసరం. ప్రాజెక్టుకు అరకొరగా నిధులు కేటాయించడంతో ఈ ఏడాది పనులు పూర్తయ్యే పరిస్థితి లేదు. మరి 2026 నాటికల్లా నీరు రాకుండా ఉంటే తాగునీరు సమస్య, అటు పారిశ్రామిక, విమానాశ్రయానికి నీరు లేక వెలవెలబోతుంది. ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే ఎయిర్‌పోర్టు అవసరాలకు తాగునీరు, వాడుక నీరు ప్రధానం కావున ఇందుకోసం తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాల్సి ఉంది.


వరకట్న వేధింపుల కేసులో ముగ్గురికి జైలుశిక్ష



కోర్టు తీర్పును వెల్లడిస్తున్న డీఎస్పీ గోవిందరావు

విజయనగరం క్రైమ్: నాలుగేళ్ల క్రితం విజయనగరంలోని దిశ పోలీస్ స్టేషన్‌లో నమోదైన వరకట్నవేధింపుల కేసులో ముగ్గురు ముద్దాయిలకు విజయనగరం స్పెషల్ మొబైల్ కోర్ట్ బుధవారం జైలు శిక్ష విధించినట్లు మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ గోవిందరావు తెలిపారు. 2021లో విజయనగరం మహిళా పోలీస్‌స్టేషన్‌లో నమోదైన వరకట్న వేధింపుల కేసులో ముద్దాయిలు ముగ్గురికి ఒక ఏడాది సాధారణ జైలు, రూ.51వేల జరిమానా విధిస్తూ విజయనగరం జేఎఫ్‌సీఎం (స్పెషల్ మొబైల్ కోర్టు) న్యాయమూర్తి కుమారి పి.బుజ్జి తీర్పు వెల్లడించినట్లు డీఎస్పీ ఆర్.గోవింద రావు చెప్పారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని నెల్లిమర్ల మండలం చినబూరాడపేటకు చెందిన యడ్ల మహాలక్ష్మికి గజపతినగరానికి చెందిన ఎన్ని రామకృష్ణతో 2019లో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో రూ.8 లక్షల కట్నం, 4 తులాల బంగారు ఆభరణాలు, రూ.50వేల సారె సామాన్లు కానుకగా కన్నవారు ఇచ్చారు. వివాహం అనంతరం భర్త ఎన్ని రామకృష్ణ, అతని తల్లిదండ్రులు చిన్నయ్య, సత్యవతిలు అదనంగా మరో రూ.2 లక్షలు కట్నంగా తీసుకు రావాలని మహాలక్ష్మిని శారీరకంగా, మానసికంగా వేధించడంతో బాధితురాలు మహిళా పోలీస్‌స్టేషన్‌లో 2021లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు అప్పటి మహిళా పీఎస్ ఎస్సై బి.గణేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసి, నిందితులను అరెస్టు చేసి, కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. కోర్టు విచారణలో భర్త ఎన్ని రామకృష్ణ (ఎ1), అత్త ఎన్ని సత్యవతి (ఎ2), మామ ఎన్ని చిన్నయ్య (ఎ3) వరకట్న వేధింపులకు పాల్పడినట్లు రుజువు కావడంతో ముద్దాయిలకు పై విధంగా శిక్ష విధిస్తూ స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి పి.బుజ్జి తీర్పు వెల్లడించారని డీఎస్పీ వివరించారు.

రూ.3 లక్షల విలువైన వెండి ఆభరణాలు స్వాధీనం



సోంపేటకు చెందిన నిందితుడి నుంచి వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్న జీఆర్పీ సిబ్బంది


విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్‌లోని ప్లాట్ ఫాం నంబర్ 3పై ఓ వ్యక్తి నుంచి వెండి ఆభరణాలను జీఆర్పీ సిబ్బంది బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి జీఆర్పీ ఎస్సై బాలాజీరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా సోం పేటకు చెందిన ప్రవీణ్ సింగ్ ఒక బ్యాగ్‌లో సుమారు రూ.3 లక్షలు విలువ చేసే పది కేజీల వెండి ఆభరణాలను పట్టుకెళ్తున్నట్లు సమాచారం అందగా శ్రీకాకుళం నుంచి విజయనగరం వచ్చే రైలులో దిగిన ప్రవీణ్‌ను పట్టుకుని విచారణ చేయగా పొంతన లేని సమాధానాలు ఇచ్చాడు. దీంతో తమదైన శైలిలో విచారణ చేసి రవాణా చేస్తున్న ఆభరణాలకు ఎలాంటి రుసుము, ఆధారాలు లేకపోవడంతో వెంటనే అదుపులోకి తీసుకున్నామని జీఆర్పీ ఎస్సై బాలాజీరావు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

కేజీబీవీలో అగ్నిప్రమాదంపై ఫైర్ ఆడిట్

● విద్యార్థులు ఆందోళన చెందొద్దు
● సోమవారానికి పూర్తిస్థాయిలో తరగతుల ప్రారంభం
● కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
● కేజీబీవీని సందర్శించి దుర్ఘటనపై ఆరా



అగ్నిప్రమాదం జరిగిన తీరును పాఠశాల ఎస్‌ఓ విజయ కుమారిని అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ అంబేడ్కర్



ప్రమాదం జరిగిన తరగతి గదులను పరిశీలిస్తున్న కలెక్టర్

కొత్తవలస: మండలంలోని అడ్డూరువానిపాలెం గ్రామం సమీపంలో గల కస్తూర్బా గాంధీ పాఠశాలలో మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంపై వెంటనే ఫైర్ ఆడిట్ నిర్వహించి, సాయంత్రం లోగా నివేదికను అందజేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యుత్, సమగ్రశిక్ష ఇంజినీర్ అధికారులు, జిల్లా ఫైర్ అధికారులను ఆదేశించారు. కేజీబీవీలోని తరగతి గదుల్లో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పాఠశాలను కలెక్టర్ బుధవారం సందర్శించారు. కాలిపోయిన తరగతి గదులను, సామగ్రి, చుట్టుపక్కల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో మాట్లాడి జరిగిన ఘటనపై ఆరా తీశారు. ఉన్న విద్యార్థులకే వసతి సౌకర్యం లేక, తరగతి గదుల్లోనే భోజనం, పడుకోవడం వంటివి చేస్తున్నట్లు గుర్తించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇంటర్ తరగతులకు అనుమతులు ఎలా ఇచ్చారని జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యం నాయుడిని ప్రశ్నించారు. జిల్లాలోని అన్ని కేజీబీవీలకు ప్లస్ టూ అనుమతులు ఇచ్చామని ఆయన బదులిచ్చారు. దీంతో కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

యథావిధిగా మెగా పేరెంట్స్, టీచర్ సమావేశం

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలనుంచి వెళ్లిపోయిన విద్యార్థులను వెంటనే రప్పించి తరగతులను యథావిధిగా ప్రారంభించాలని స్పష్టం చేశారు. విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పాఠశాలలో పరిస్థితులన్నీ బాగానే ఉన్నాయని విద్యార్థులందరూ పాఠశాలకు తిరిగి రావాలని కోరారు. గురువారం జరిగే మెగా పేరెంట్, టీచర్స్ సమావేశాన్ని యథావిధిగా నిర్వహిస్తామని ప్రకటించారు.సోమవారం నాటికి పూర్తిస్థాయిలో విద్యార్థులను పాఠశాలకు రప్పించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలోని ప్రస్తుతం పనులను సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ రామారావు దగ్గరుండి నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ డి.కీర్తి, విద్యుత్‌శాఖ ఎస్ఈ లక్ష్మణరావు, డీఎంహెచ్‌ఓ జీవనరాణి, జిల్లా ఫైర్ అధికారి రామ్ కుమార్, ఎస్ఎస్ఏ ఈఈ హరిప్రసాద్, ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ స్వప్న, తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీఓ రమణయ్య, ఎంఈఓలు శ్రీదేవి, బి.శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల హాహాకారాలు



ప్రాజెక్టు ఒడ్డున అధికారులు

● మడ్డువలస ప్రాజెక్టులో చేపలవేటకు వెళ్లి గుర్రపుడెక్కలో చిక్కుకున్న మత్స్యకారులు
● కాపాడేందుకు రంగంలోకి దిగిన పోలీసులు, మత్స్యకారులు
● ప్రాజెక్టులో గాలింపు చర్యలు



ప్రాజెక్టులో మత్స్యకారుల గాలింపు చర్యలు

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టులో చేపలవేటకు వెళ్లిన ఇద్దరు మత్స్యకారులు గుర్రపుడెక్క మధ్యలో బుధవారం చిక్కుకున్నారు. వారిని బయటకు తెచ్చేందుకు పోలీసులు, మత్స్యకారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మెట్టుమగ్గూరు గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు దాసరి రాములు, దాసరి ఆదినారాయణ బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో చేపలు వేటకు వెళ్లారు. ప్రాజెక్టులో దట్టంగా ఉన్న గుర్రపుడెక్క వీరిని చుట్టుముట్టడంతో పడవ ముందుకు సాగని పరిస్థితి. తండ్రీ కొడుకులు అందులో చిక్కుకోవడంతో తమను రక్షించాలంటూ ప్రాజెక్టు లోపలి భాగం నుంచి కేకలు వేస్తూ ఆర్తనాదాలు చేశారు. విషయం తెలుసుకున్న వంగర పోలీసులు హుటాహుటిన ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. ఎగువ ప్రాంతాల్లో ఉన్న పట్టువర్ధనం గ్రామం నుంచి కొంతమంది మత్స్యకారులు, మగ్గూరు గ్రామం నుంచి కొంత మంది మత్స్యకారులను ఆరు పడవలతో ప్రాజెక్టు లోపలకు పంపించారు. కటిక చీకటి కావడంతో గుర్రపుడెక్కను తొలగించుకుంటూ వారి వద్దకు వెళ్లేందుకు చేసిన ప్రయత్నంలో అష్టకష్టాలు పడ్డారు. బాధితుల కేకలు వినిపిస్తున్నప్పటికీ దట్టంగా అల్లుకున్న గుర్రపుడెక్క కారణంగా వారి వద్దకు చేరుకునే పరిస్థితి కానరావడం లేదు. రాత్రి వరకు శ్రమించినప్పటికీ కటిక చీకటి కావడంతో పాజెక్టులో చిక్కుకున్నవారిని చేరుకునేందుకు తోటి మత్స్యకారులకు వీలు పడలేదు. అర్ధరాత్రి అయ్యేసరికి వారిని బయటకు తీసుకువస్తామంటూ బాధిత కుటుంబీకులకు పోలీసులు భరోసా ఇస్తున్నారు. మత్స్యకారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించి క్షేమంగా ఒడ్డుకు చేరుకోవాలని రాములు కుటుంబ సభ్యులు గంగమ్మతల్లిని ప్రార్థిస్తున్నారు.

3250 కేజీల రేషన్ బియ్యం పట్టివేత



అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్న సీఐ అప్పలనాయుడు

సాలూరు: పట్టణంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టణ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఈ మేరకు సీఐ అప్పలనాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పెద బజార్‌లో గల బుద్దెపు సురేష్ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన 75 బియ్యం బస్తాల్లో సుమారు 3,250 కేజీల రేషన్ బియ్యం పట్టుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి తక్కువ ధరకు ఈ బియ్యం కొని, బయట ఎక్కువ ధరకు అమ్ముతానని నిందితుడు తెలిపినట్లు సీఐ పేర్కొన్నారు. పట్టుకున్న బియ్యాన్ని పట్టణ సివిల్‌సప్లయిస్ అధికారులకు తదుపరిచర్యల నిమిత్తం అప్పగించామని తెలిపారు.

వెబ్‌సైట్‌లో స్పీకింగ్ ఆర్డర్స్ జాబితా

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో 20 కేటగిరిల్లో 91 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వగా అందులో 12 కేటగిరిలకు సంబంధించిన పోస్టుల స్పీకింగ్ ఆర్డర్స్ జాబితాను విజయనగరం.ఏపీ. జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలీల తెలిపారు. స్పీచ్ థెరపిస్టు, కంప్యూటర్ పోగ్రామ్, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, పీఈటీ, జూనియర్ అసిస్టెంట్ కమ్ అసిస్టెంట్, లైబ్రరీ అసిస్టెంట్, ఎలక్ట్రీషియన్ గ్రేడ్-3, ల్యాబ్ టెక్నీషియన్, ఆఫీస్ సబార్డినేట్, జనరల్ డ్యూటీ అటెండెంట్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, పోస్టుల జాబితా వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు.

గంజాయి, పోక్సో కేసులపై దృష్టి పెట్టండి

విజయనగరం క్రైమ్: పెరుగుతున్న గంజాయి కేసుల నివారణపై దృష్టి పెట్టాలని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని అన్ని స్టేషన్ల హౌస్ ఆఫీసర్లు, మూడు డివిజన్ల అధికారులతో ఎస్పీ వకుల్ జిందల్ బుధవారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్, ఎన్డీపీఎస్, పోక్సో, అట్రాసిటీ, మిస్సింగ్, రోడ్డు ప్రమాదాల కేసులను, లాంగ్ పెండింగ్ కేసులను ఈ సందర్భంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ ప్రజలకు శక్తి యాప్ గురించి అవగాహన కల్పించాలని ఇందుకు శక్తి టీమ్స్ మరింత విస్తృతంగా పని చేయాలని ఆదేశించారు. కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్సు టెక్నిక్స్ నేర్పించేందుకు శక్తి వారియర్స్ టీమ్స్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని చెప్పారు.

ఫిర్యాదు దారులతో మర్యాదగా ప్రవర్తించాలి

మహిళలపై జరిగే అఘాయిత్యాలపై పోలీస్‌స్టేషనుకు వచ్చే ఫిర్యాదులపై వెంటనే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని, స్టేషన్‌లో ఫిర్యాదుదారులు వేచి ఉండకుండా చూడాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణ నియంత్రణపై దృష్టి పెట్టాలని, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నాలుగు చెక్ పోస్టుల వద్ద నిరంతరం వాహన తనిఖీలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. అనంతరం పలు కేసుల్లో శాఖాపరంగా ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందల్ ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ పి. సౌమ్యలత, విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాస రావు, బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యరెడ్డి, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, మహిళా పిఎస్ డీఎస్పీ ఆర్.గోవిందరావు, డీటీసీ డీఎస్పీ ఎం.వీరకుమార్ ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒక్కో బెడ్‌పై ఇద్దరు రోగులకు వైద్యం

● గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో తప్పని అవస్థలు
● జ్వరాల వ్యాప్తితో ఆస్పత్రికి రోగుల తాకిడి



గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో సేవలు పొందుతున్న రోగులు

ఆస్పత్రిలో బెడ్‌లు ఇలా..	
మెడికల్ వార్డులో	35
గైనిక్ వార్డులో	13
క్యాజువాల్టీలో వార్డులో	03
ఆస్పత్రి వరండాలో	03
ఫిజియోథెరపీ రూంలో	01
ఆపరేషన్ థియేటర్‌లోని బెడ్	01
మొత్తం బెడ్‌లు	56

గజపతినగరం రూరల్:

గతంలో ఎన్నడూ చూడని విధంగా జిల్లాలో జ్వరాలు వ్యాప్తిచెందుతున్నాయి. ఆస్పత్రులకు జ్వరపీడితుల తాకిడి పెరిగింది. ఓపీ పెద్ద సంఖ్యలో నమోదవుతోంది. ఇన్‌పేషెంట్ల సంఖ్య పెరుగుతోంది. ఆస్పత్రుల్లో బెడ్‌లు చాలడం లేదు. ఒక్కో బెడ్‌పై ఇద్దరుముగ్గురికి వైద్యసేవలు అందించాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో సేవల తీరే నిలువెత్తు సాక్ష్యం. ఇక్కడ బెడ్‌లు 56 ఉండగా ఇన్‌పేషెంట్లు 79 మంది ఉన్నారు. చేసేదిలేక ఒక్కో బెడ్‌పై ఇద్దరిని ఉంచి వైద్యసేవలు అందిస్తున్నారు.

అందుబాటులోకి రాని భవనం

గజపతినగరం నియోజకవర్గ కేంద్రంలోని ఏరియా ఆస్పత్రి మెంటాడ, దత్తిరాజేరు, బొండపల్లి, గజపతినగరం మండలాల్లోని 120 గ్రామాల ప్రజల వైద్యసేవలకు ఆధారం. దీని ప్రాధాన్యతను గుర్తించిన గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 100 పడకలకు స్థాయి పెంచుతూ రూ.17కోట్లు మంజూరు చేసింది. భవన నిర్మాణాన్ని సుమారు 85 శాతం మేర పూర్తి చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఆస్పత్రి మిగులు పనులపై శ్రద్ధచూపలేదు. ఫలితం రోగులకు వైద్యకష్టాలు తప్పడంలేదు. వరండాల్లోను, ఒక్కో బెడ్‌పై ఇద్దరు చొప్పున ఉంటూ వైద్యసేవలు పొందాల్సి వస్తోంది. ఇదే విషయాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి జీవనరాణి వద్ద 'సాక్షి' ప్రస్తావించగా వంద పడకల ఆస్పత్రి అందుబాటులోకి వచ్చేవరకు రోగులకు ఇబ్బందులు తప్పవన్నారు.





ఒక్కో బెడ్‌పై ఇద్దరేసి రోగులు సేవలపొందుతున్నారిలా..